రుణాల రెన్యూవల్ కోసం
పాస్‌బుక్‌ల క్యూ 7



లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి
సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర 7

హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో
త్వరలో షార్ట్‌టర్మ్ కోర్సులు

సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

కోహీర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోహీర్ మండలం కవెల్లి చౌరస్తా వద్ద ఉన్న రాష్ట్రస్థాయి హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీని త్వరలో తెరిపించి షార్ట్‌టర్మ్ కోర్సులను ప్రారంభిస్తామని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. కాలేజీ మూతపడటంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన 'మూసివేత దిశగా హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల' అనే కథనానికి ఆమె స్పందించారు. నిరుపయోగంగా మారిన కళాశాల భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. కాలేజీని తిరిగి తెరిపించి స్వల్పకాలిక కోర్సులు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగులకు బేకరీ పదార్థాల తయారీపై శిక్షణ ఇచ్చి, ఇక్కడి నుంచే బేకరీలకు సప్లై చేసుకొని ఉపాధి పొందే అవకాశం కల్పిస్తాన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, స్టేట్ హోటల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వెంకటరమణ, ఆర్డీవో దేవిజ నాయక్, తహసీల్దార్ సుప్రియ, ఎంపీడీవో భారతి, డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీవో వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

మునిపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి గురుకుల హాస్టల్ కూల్చివేత పనులను కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

సంగారెడ్డికి అదనంగా మంజీర నీటి సరఫరా కోసం
రూ.200 కోట్లతో ప్రతిపాదనలు

50 సంవత్సరాల వరకు ఇబ్బందులు రాకుండా చూడాలి

మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులకు సూచించిన జగ్గారెడ్డి



మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణ ప్రజలకు అదనంగా మంజీర నీటిని సరఫరా చేసేందుకు రూ.200కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అధికారులకు సూచించారు. సంగారెడ్డిలో మున్సిపల్, పబ్లిక్‌హెల్త్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కొత్త ఫిల్టర్‌బెడ్, ఇంటెక్ వెల్ నిర్మించాలని సూచించారు. అన్ని మతాలకు సంబంధించిన పండుగల సమయంలో ఉదయం, సాయంత్రం అదనంగా 2 గంటలు మంజీర నీటిని అందించాలన్నారు. అవసరమైన చోట కొత్త డిస్ట్రిబ్యూషన్ లైన్లు, ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. సంగారెడ్డి శివారులోని కల్పగూర్, కులబ్‌గూర్, తాళ్లపల్లి, గంజిగూడెం, ఇరిగిపల్లి, కొత్లాపూర్, ఫసల్‌వాది, తదితర గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసేలా డిజైన్ చేయాలని చెప్పారు. రాబోయే 50 సంవత్సరాల వరకు సంగారెడ్డికి తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మరోసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజీర నీటిని తీసుకువస్తే, రాష్ట్ర విభజన అనంతరం ఆ పథకాన్ని నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథతో సంబంధం లేకుండా నేరుగా పాత మంజీర వాటర్ స్కీమ్ మాదిరిగా సంగారెడ్డికి మంజీర నీటిని సరఫరా చేయాలన్నదే తన లక్ష్యమని అధికారులతో జగ్గారెడ్డి పేర్కొన్నారు. రాజంపేట ఫిల్టర్‌బెడ్, ఇంటెక్‌వెల్ పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జగ్గారెడ్డి వెంట కాంగ్రెస్ నాయకులు కూన సంతోశ్‌కుమార్ ఉన్నారు.

ఆస్పత్రి సిబ్బందికి
డబ్బులు ఇవ్వొద్దు

సంగారెడ్డి ఎంసీహెచ్‌లో ఫ్లెక్సీలు



సంగారెడ్డి ఎంసీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు చర్యలకుపక్రమించారు. ప్రసవం తర్వాత బిడ్డను అప్పగించేందుకు, గర్భిణులు, బాలింతలకు సపర్యలు చేసినందుకు, జనరల్ వార్డుకు తరలించినందుకు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఇటీవల అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో, అధికారులు ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్, లేబర్‌రూమ్, ఎంఐసీయూ వార్డుల్లో డబ్బులు ఇవ్వరాదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. ఎవరైనా డబ్బులు అడిగితే 9346055799 నంబర్‌లో ఆర్ఎంవోకు ఫిర్యాదు చేయాలని ఫ్లెక్సీలో పేర్కొన్నారు.

ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురవనుంది. కేవలం దరఖాస్తుల ద్వారానే సుమారు రూ.400 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. వచ్చే నవంబరు 30వ తేదీతో మద్యం దుకాణాల గడువు పూర్తవుతున్నది. డిసెంబరు ఒకటి నుంచి కొత్త వైన్ షాపులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే ఆబ్కారీ శాఖ కసరత్తు ప్రారంభించగా, దరఖాస్తుల ఫీజు పెంచనున్నట్లు మార్గదర్శకాలు సైతం అందినట్లు తెలిసింది. గతంలో ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షలు ఉండగా ఈసారి రూ.3లక్షలుగా నిర్ణయించినట్లు సంకేతాలు వచ్చాయి. వచ్చేది ఎన్నికల సీజన్ కావడంతో మద్యం విక్రయాలు కూడా జోరందుకుంటాయని భావిస్తున్నారు. అందుకే దరఖాస్తు ఫీజును లెక్క చేయకుండా ఆశావహులు ముందడుగు వేయడానికి సై అంటున్నారు.



ఆబ్కారీ మనీ

2023లో ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	వైన్సులు	దరఖాస్తులు	ఆదాయం
సంగారెడ్డి	101	6,156	123.12
సిద్దిపేట	93	4,166	83.32
మెదక్	49	1,905	38.10
మొత్తం	243	12,227	244.54

(ఆదాయం రూ.కోట్లలో)

ఈసారి దరఖాస్తులకే రూ.400 కోట్లు..!

ఎన్నికల నేపథ్యంలో భారీ పోటీకి అవకాశం

ఉమ్మడి జిల్లాలో 243 మద్యం దుకాణాలు

రెండేళ్ల క్రితం 12,227 దరఖాస్తులతో రికార్డు

సంగారెడ్డి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 243 మద్యం దుకాణాలు ఉన్నాయి. రెండేళ్ల కాలపరిమితికి సంబంధించి 2023వ సంవత్సరంలో డ్రా పద్ధతిన నిర్వాహకులు ఈ షాపులు పొందారు. నవంబరు 30వ తేదీతో గడువు ముగుస్తున్న క్రమంలో 2 నెలల ముందుగానే ఈ ప్రక్రియను ప్రారంభించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి సంబంధించిన పలు వివరాలను జిల్లా ఎక్సైజ్ కార్యాలయాల నుంచి సేకరిస్తున్నారు. కొత్త షాపుల పెరుగుదలపైనా యోచిస్తున్నారు.

అదనంగా రూ.100 కోట్లు

రెండేళ్ల క్రితం నాడు అసెంబ్లీ, పార్లమెంటుతోపాటు స్థానిక, పంచాయతీ ఎన్నికలు వస్తాయనే ఉద్దేశంతో పోటాపోటీగా దరఖాస్తులు సమర్పించారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున వెచ్చించారు. ఈ డబ్బులు తిరిగిరావని తెలిసినా వెనుకంజ వేయలేదు. అప్పుడు ఉమ్మడి జిల్లాలో 243 షాపులకు 12,227 దరఖాస్తులు సమర్పించగా రూ.244.54 కోట్ల రికార్డుస్థాయి ఆదాయం వచ్చింది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.3 లక్షలు నిర్ణయిస్తున్న క్రమంలో అదనంగా మరో రూ.100 కోట్లు వస్తుందని అంచనా

మిగతా 7వ పేజీలో

అసైన్డ్ భూమికి ఎసరు

నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు

ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు రంగం సిద్ధం

ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు

నర్సాపూర్ మున్సిపాలిటీలో అక్రమార్కుల లీలలు



నర్సాపూర్‌లో ఇంటి నంబర్లు కేటాయించిన అసైన్డ్ భూమి

నర్సాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో అత్యంత విలువైన కోట్ల రూపాయలు పలికే అసైన్డ్ భూమిపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. అసైన్డ్ దారుల నుంచి చవకగా కొనుగోలుచేసి ప్లాట్లుగా మార్చి, మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు తీసుకుని విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారు. నర్సాపూర్ పట్టణ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం పక్కన రెండెకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇక్కడ ఇంటి స్థలం గజం రూ.10వేలు పలుకుతున్నది. ఇదే అదునుగా కొందరు స్థానిక నాయకుల కన్ను ఈ భూమిపై పడింది. నిబంధనలకు విరుద్ధంగా రెండెకరాల అసైన్డ్ భూమి కొనుగోలు చేశారు. ఇంటి నిర్మాణాలు చేయకుండానే 15 ఇళ్లకు నంబర్లు కూడా తీసుకుని ఆ నంబర్లతో ప్లాట్లను విక్రయించేందుకు యత్నిస్తున్నారు. ఇందుకోసం గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్ సహకరించినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై అధికారులు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

విచారణ జరిపిస్తాం

నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. అసైన్డ్ భూమిలో ఖాళీ స్థలాలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయించిన విషయం నా దృష్టికి రాలేదు. ఈ విషయంపై విచారణ జరిపించి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. వారి ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటాం.

-శ్రీరాం చరణ్ రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్

గురువులతోనే భారత సంస్కృతికి గొప్ప స్థానం

ఆదర్శ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ప్రభుత్వం మదిలో టీచర్లకు హెల్త్‌కార్డుల ఆలోచన

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



నియోజకవర్గస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, గురువులు, ఆచార్యులతోనే భారత సంస్కృతికి ప్రపంచంలో గొప్ప స్థానం వచ్చిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. అందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి విద్య, వైద్యమే అత్యవసరమని పేర్కొన్నారు. మహిళలు చదువుకుంటే కుటుంబమంతా బాగుపడుతుందన్నారు. తాను గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసినప్పుడు నియోజకవర్గంలో ఎన్నో కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, మూడు పాలిటెక్నిక్ కళాశాలలు, ఒక జేఎన్టీయూ సంస్థను ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. ప్రస్తుతం వైద్యశాఖ మంత్రిగా నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశానన్నారు. టీచర్లు ఎప్పుడూ హెల్త్‌కార్డుల గురించే తప్ప విద్య, వైద్య రంగాల్లో ఒక కళాశాలనో, పాఠశాలనో ఏర్పాటు చేయమని అడగడం లేదని చమత్కరించారు. ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గంలో ఎంపిక చేసిన 150 మంది ఉత్తమ ఉపాధ్యాయులను మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య యాదవ్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముక్త జగన్మోహన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జీఆర్ నరేందర్ రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య, కాంగ్రెస్ నాయకులు శివరాజ్, చిట్టిబాబు, రాజిరెడ్డి, ధనంజయ రెడ్డి, పీఆర్టీయూ నాయకులు నరోత్తం, రాజమల్లు, అనిల్, అనూరాధ, రమ తదితరులు పాల్గొన్నారు.

గత వారం మెదక్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పదుల సంఖ్యలో చెరువులు దెబ్బతిన్నాయి. మూడు రోజుల పాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు గతంలో ఎన్నడూ లేనంత భారీ వరద రావడంతో చాలా చెరువులకు గండ్లు పడి నీరంతా వృథాగా బయటకు వెళ్లింది. మత్తళ్లు దెబ్బతిని, తూములు కొట్టుకుపోయి, కట్టలు కోతకు గురయి బలహీనపడ్డాయి. చెరువులు నిండాయనే ఆనందం లేకుండా కట్టలు తెగి వరద నీరు కింద ఉన్న పంట పొలాలను ముంచేసింది. వరి సాగులో ప్రధానపాత్ర పోషించే చెరువులు దెబ్బ తినడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. తక్షణమే మరమ్మతులు చేపట్టకపోతే ఉన్న కాస్త నీరు యాసంగి సీజన్ వరకు ఇంకిపోయి ఆయకట్టు బీడువారే ప్రమాదం పొంచి ఉంది.



హవేళిఘణపూర్ మండలంలో గండిపడిన 120 ఏళ్ల నాటి రాయిన్‌పల్లి హైలెవెల్ ప్రాజెక్ట్

చెరువులకు చెరుపు..!

- మెదక్ జిల్లాలో 63 ధ్వంసం
- గత వారం కురిసిన భారీ వర్షాలే కారణం
- మరమ్మతులకు రూ.30 కోట్లు అవసరం
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

మెదక్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 63 చెరువులు తీవ్రంగా దెబ్బతిన్నట్లు జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 2,563 చిన్నా, పెద్దా చెరువులు ఉన్నాయి. భారీ వర్షాల వల్ల పలు చెరువులు పాక్షికంగా దెబ్బతినగా, మరికొన్ని చెరువులు ధ్వంసమయ్యాయి. దీంతో కోట్ల రూపాయల మేర నష్టం సంభవించింది. హవేళిఘణపూర్ మండలంలోని హైలెవెల్ ప్రాజెక్టు అయిన రాయిన్‌పల్లి చెరువులోకి భారీగా వరద చేరడంతో కట్టలు బలహీనపడి తెగిపోయాయి. సైడ్ వాల్స్ కొట్టుకుపోయాయి. ఈ ఒక్క చెరువుకే సుమారు రూ.1 కోటి నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఈ మండల పరిధిలో ఆరు చెరువుల కట్టలు కోతకు గురైనట్లు అధికారుల పరిశీలనలో వెల్లడయ్యింది. నర్సాపూర్ మండల పరిధిలో 10 చెరువుల కట్టలు కోతకు గురై బలహీన పడడం, తూములు ధ్వంసమయ్యాయి. మండలాలవారీగా కౌడిపల్లి 6, శివ్వంపేట 6, నిజాంపేట 5, చిలప్‌చెడ్ 4, మనోహరాబాద్ 4, పాపన్నపేట 3, చిన్నశంకరంపేట 3, రేగోడ్ 3, అల్లాదుర్గం 3, మెదక్ 2, రామాయంపేట 2, చేగుంట 2, తూప్రాన్ 2, కొల్చారం 1, వెల్దుర్తి మండలంలో ఒక చెరువుకు నష్టం వాటిల్లినట్లు మెదక్ జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొన్నారు.

రూ.30 కోట్ల నష్టం

మెతుకుసీమలో చెరువులకు జరిగిన నష్టాన్ని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నాలుగు రోజులుగా చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఏ చెరువు ఎంత మేరకు దెబ్బతిన్నది, ఎక్కడెక్కడ గండ్లు పడ్డాయో కట్టలు ఏ మేరకు కోతకు గురై బలహీనపడ్డాయో అంచనా వేస్తున్నారు. తూముల పరిస్థితి, గైడ్‌వాల్స్, మత్తళ్లను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. మెదక్, హవేళీఘనపూర్ మండలాలలో అధికంగా చెరువులకు నష్టం వాటిల్లిందని ఇరిగేషన్ డీఈ నాగరాజు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో చెరువులకు సుమారు రూ.18 కోట్ల వరకూ నష్టం జరిగిందని అంచనా వేస్తున్నారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో రూ. 5 కోట్లు నష్టం వాటిల్లిందని సమాచారం. దుబ్బాక నియోజకవర్గంలోని చేగుంట, నార్సింగి, మండలాలు, గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్, మనోహరాబాద్, అందోల్ నియోజకవర్గంలోని పెద్ద శంకరంపేట, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాల పరిధిలో పలు చెరువులను కలుపుకుని జిల్లాలో మొత్తం రూ.30 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని నివేదక సిద్ధం చేస్తున్నారు.

మరమ్మతులకు మీనమేషాలు

జిల్లాలో వరదలు వచ్చి పది రోజులు గడుస్తున్నా దెబ్బతిన్న చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. అధికారులు తాత్కాలిక పనులకు అయ్యే వ్యయం అంచనా వేసి కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా నిధుల కేటాయింపులో జాప్యంతో మరమ్మతు పనులు ప్రారంభం కాలేదని తెలుస్తున్నది.



సిరుల సీతాఫలం

- శీతాకాలానికి ముందే కోతకు..
- రామాయంపేటలో స్పెషల్ మార్కెట్ 7
- రోజూ 400 గంపల విక్రయం
- నాలుగు రాష్ట్రాలు, జంటనగరాలకు ఎగుమతి
- రూ.2లక్షల వ్యాపారం

సంగారెడ్డిలో కేంద్ర వైద్య బృందం



సంగారెడ్డి డీఈఐసీ కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం వైద్యుల బృందం శుక్రవారం పర్యటించింది. న్యూఢిల్లీ నుంచి వచ్చిన చైల్డ్ హెల్త్ అండ్ ఆర్‌బీఎస్‌కే డిప్యూటీ కమిషనర్ శోభనా గుప్తా, యూనిసెఫ్ బృందం సభ్యులు అన్నపూర్ణ, సలీమా, హైదరాబాద్‌కు చెందిన చైల్డ్ హెల్త్ కోఆర్డినేటర్ బద్రీనాథ్, యూనిసెఫ్ కన్సల్టెంట్ విక్రమ్‌తో కూడిన బృందం ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, తల్లిపాల నిల్వ కేంద్రంతో పాటు డీఈఐసీ కేంద్రాలను సందర్శించారు. ఆయా విభాగాల్లో చిన్నారులకు అందుతున్న వైద్యసేవలు, అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు కొండాపూర్ మండలంలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు సందర్శించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఆర్ఎంవో వీరాంజనేయులు, పీవోడీటీ శశాంక్‌దేశ్‌పాండే, వైద్యులు మధుసూదన్‌రెడ్డి, భవ్య, సమీనా, సిబ్బంది ప్రభాకర్, శ్రీనివాస్, అంజన్న, విజయలక్ష్మి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త స్టేషన్‌లో కూత ఎప్పుడో?!

●నత్త నడకన రైల్వేస్టేషన్ పనులు ● శిథిలావస్థలో పాత స్టేషన్



కోహీర్‌లోని రైల్వే స్టేషన్

కోహీర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మున్సిపల్ పట్టణ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే స్టేషన్ నిర్మాణం పనులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి. కోహీర్ రైల్వే స్టేషన్ పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రైల్వే శాఖ కోహీర్‌లో నూతన రైల్వే స్టేషన్ భవన నిర్మాణానికి రూ. 1.80 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కొత్త రైల్వే స్టేషన్ భవనంతో పాటు 100 మీటర్ల ప్లాట్ ఫామ్ నిర్మాణం చేయాల్సి ఉంది. నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం పనులు చేపట్టి దాదాపు ఏడాది అవుతున్న ఇంకా భవన నిర్మాణం పూర్తి కాలేదు. ప్లాట్ ఫామ్ పనులు ఇంకా ప్రారంభించనే లేదు. ఇప్పటివరకు70 శాతం పనులు పూర్తికాగా మరో 30 శాతం పనులు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాత రైల్వే స్టేషన్‌లోకి వచ్చేందుకు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించి కొత్త రైల్వే స్టేషన్ భవనాన్ని త్వరగా పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



కోహీర్ మున్సిపల్ పట్టణ పరిధిలో నిర్మిస్తున్న నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలి. ప్రస్తుతం పాత రైల్వే స్టేషన్ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. నూతన రైల్వే స్టేషన్ నిర్మాణానికి రైల్వే శాఖ నిధులు మంజూరు చేసినప్పటికీ నిర్మాణం పనులు ఆలస్యంగా కొనసాగుతున్నాయి. రైల్వే శాఖ ఉన్నది అధికారులు స్పందించి త్వరగా కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణం పనులు పూర్తి చేయాలి.

-ఎంఏ ఖలీమ్, కోహీర్

మరణంలోనూ తోడుగా..

● అనారోగ్యంతో భర్త మృతి.. తట్టుకోలేక భార్య ఆత్మహత్య

● అనాథలైన ఇద్దరు పిల్లలు



మహేందర్, కావ్య (ఫైల్)



అనాథలైన పిల్లలు ప్రణయ్, శివ

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెళ్లి సమయంలో చివరి వరకు తోడుంటానని చేసిన బాసలు ఆ జంట నిజం చేసింది. భర్త లేని జీవితం తనకూ వద్దనుకున్న ఓ ఇల్లాలు తనూ ఆత్మహత్య చేసుకుంది. భర్త అనారోగ్యంతో చనిపోగా.. ఆమె గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఆమెను కాపాడుకునేందుకు బంధువులు ప్రయత్నించినా ప్రాణాలు దక్కలేదు. గంటల వ్యవధిలో తల్లిదండ్రులిద్దరూ తమను వదిలి వెళ్లిపోవడంతో వారి ఇద్దరు కుమారులు రోదించిన తీరు అక్కడి వారిని కంటనీరు పెట్టించింది. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు.. గ్రామానికి చెందిన కొబ్బరిచెట్టు మహేందర్(40), కావ్య(35) భార్యాభర్తలు. వీరికి తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రణయ్, నర్సరీ చదువుతున్న శివ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. మహేందర్ వ్యవసాయంతో పాటు ట్రాక్టర్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురి కాగా, ఈ నెల 8న కరీంనగర్ లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మరణించాడు. మృతదేహాన్ని రాత్రి ఇంటికి తీసుకువచ్చారు. భర్త మృతదేహాన్ని తట్టుకోలేని భార్య ఇంట్లోకి వెళ్లి గడి మందు తాగింది. బంధువులు వెంటనే ఆమెను 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించడంతో బంధువులు సిద్దిపేటలోనే ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ శుక్రవారం వేకువ జామున ఆమె మృతి చెందింది. దీంతో వారి పిల్లలిద్దరూ అనాథలుగా మారారు. తల్లిదండ్రులిద్దరూ కొన్ని గంటల వ్యవధిలోనే చనిపోవడంతో ఆ చిన్నారులిద్దరూ రోదించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

బాలుడి అదృశ్యం



సందీప్‌కుమార్ (ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం ఘనపూర్‌లో నివాసముండే బీహార్ రాష్ట్రానికి చెందిన బాలుడు అదృశ్యమయ్యాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన మనోజ్ ప్రసాద్ మేస్త్రీ పనులను చూసుకునేందుకు తూప్రాన్ మండలం ఘనపూర్ శివారులోని ప్రోలాన్స్ సీడ్స్ కంపెనీకి వచ్చాడు. మనోజ్ ప్రసాద్ పెద్ద కుమారుడు సందీప్‌కుమార్(16)కు మానసిక ఆరోగ్యం సరిగా లేకపోవడంతో హైదరాబాద్‌లో చూపించేందుకు నెల రోజుల క్రితం ఇక్కడకు తీసుకువచ్చాడు. ఈ నెల 8న సాయంత్రం కూరగాయలు తీసుకురావడానికి ఘనపూర్ ఊర్లోకి మనోజ్‌ప్రసాద్ వెళ్లగా, కంపెనీ వద్ద గదిలో ఉన్న సందీప్‌కుమార్ కనిపించకుండా పోయాడు. బాలుడి కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

దేవుడు చూపిన ప్రదేశానికి వెళ్తున్నానని..



వీరేశ్ (ఫైల్)

పటాన్‌చెరు సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలలో దేవుడు కనిపించి తనకో ప్రదేశాన్ని చూపించాడని, అక్కడికి వెళ్తున్నానంటూ సోదరుడి ఫోన్‌కు మెసేజ్ పెట్టిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయాడు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఎస్సై సుభాష్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఇందిరమ్మ కాలనీకి చెందిన వీరేశ్ పాశమైలారం పారిశ్రామిక వాడలోని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పని చేస్తాడు. గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం 6.30 గంటలకు అతని సోదరుడైన విఠల్ ఫోన్‌కు 'రాత్రి దేవుడు నాకు కలలో కనిపించి, ఓ ప్రదేశాన్ని చూపించాడు. అక్కడికి వెళ్తున్నా' అని మెసేజ్ పెట్టాడు. తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో విఠల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చుంచనకోట గుట్టల్లో అటవీ అధికారుల పరిశీలన

● మరోమారు పాదముద్రల గుర్తింపు

● హైనా లేదా జూకాల్‌గా అనుమానం



చుంచనకోట గుట్టల శివారులో లభ్యమైన పాదముద్రలు

చేర్యాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుంచనకోట శివారు గుట్టలు, సమీప ప్రదేశాల్లో పులి సంచరిస్తుందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అటవీశాఖ అధికారులు శుక్రవారం మరోమారు పరిశీలించారు. కొద్దిరోజులక్రితం గుట్టల సమీపంలోని ఓ వ్యవసాయబావి వద్ద గుర్తు తెలియని జంతువు లేగదూడను ఈడ్చుకెళ్లింది. దీంతో ఈ ప్రాంతంలో పులి సంచరిస్తోందని స్థానికులు ఆందోళన చెందారు. అప్పుడే అటవీ అధికారులు పాదముద్రలు సేకరించి, ఓ ట్రాప్ కెమెరాను అమర్చినా, ప్రయోజనం కానరాలేదు. ఇటీవల గుట్టల శివారులో నీటికోసం చెరువు సమీపంలో పులి కనిపించిందని మహిళలు చెప్పడంతో మరో రెండు ట్రాప్ కెమెరాలు బిగించారు. శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి సమీప ప్రదేశంలో హైనా కనిపించిందని చెప్పడంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వై. రాముడు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ పరిశీలించారు. పరిసర ప్రాంతాలలో లభ్యమైన పాదముద్రలను గుర్తించి కుక్క జాతికి చెందిన హైనా లేదా జూకల్ సంచరిస్తున్నట్లు తేల్చారు.

నిమ్జ్-2 డిప్యూటీ కలెక్టర్‌గా విశాలాక్షి



నిమ్జ్-2 డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపడుతున్న విశాలాక్షి

జహీరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిమ్జ్-2 డిప్యూటీ కలెక్టర్‌గా విశాలాక్షి శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు నిమ్జ్-2 డిప్యూటీ కలెక్టర్‌గా పని చేసిన రవీందర్‌రెడి సంగారెడ్డి ఆర్డీవోగా బదిలీపై వెళ్లడంతో ఈ స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో నిమ్జ్-1 డిప్యూట్ కలెక్టర్‌గా పని చేసిన రాజిరెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుపడటంతో ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. దీంతో ఇప్పటి వరకు ఆర్డీవోగా కొనసాగిన రాంరెడ్డికి నిమ్జ్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇటీవల సెలవుపై వెళ్లడంతో అటు ఆర్డీవో, ఇటు నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న విశాలాక్షిని జహీరాబాద్ నిమ్జ్-2 డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో ఆమె శుక్రవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా అందరికి న్యాయం జరిగేలా తమవంతు బాధ్యత నిర్వహిస్తానని చెప్పారు.

రసాయన జలాలతో చేపల మృత్యువాత



బండ్లగూడ దోశం చెరువులో మృతిచెందిన చేపలు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు విడుదల చేసిన వ్యర్థ రసాయనజలాలతో చెరువులో పెరుగుతున్న చేపలు మృత్యువాత పడ్డాయి. పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడ దోశం చెరువులో మత్స్యకారులు చేపలపెంపకాన్ని చేపట్టారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం ముసుగులో పరిశ్రమల ప్రతినిధులు రసాయన జలాలు విడుదల చేశారు. ఘాటుకు వేలల్లో చేపలు చనిపోయాయి. శుక్రవారం ఉదయం గమనించిన మత్స్యకారులు లబోదిబోమన్నారు. లక్షల రూపాయలు నష్టపోయామని పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు.

మోర్ సూపర్ మార్కెట్‌కు జరిమానా



జరిమానా రసీదు అందిస్తున్న అధికారులు

తూప్రాన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో మున్సిపల్ అనుమతుల్లేకుండా చెట్లు కొమ్మలు నరికివేసిన మోర్ సూపర్ మార్కెట్‌కు జరిమానా విధించినట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్ రెడ్డి తెలిపారు. రూ. 5వేల జరిమాన విధించినట్లు పేర్కొన్నారు. అనుమతుల్లేకుండా చెట్లు, కొమ్మలు నరికితే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



కనకయ్య(ఫైల్)

కొండపాక, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం రవీంద్రనగర్ లో శుక్రవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి రవీంద్రనగర్ గ్రామానికి చెందిన నాలగం కనకయ్య(40) తన ఇంటిపైన డిష్ వైరు సరి చేస్తుండగా కేబుల్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కనకయ్య బీడీల కంపెనీలో పని చేస్తాడు. ఆయనకు భార్య స్వప్న , ఇద్దరు కుమారులు ప్రదీప్, ప్రణీత్ ఉన్నారు. ఈ మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగారావు పిఎసిఎస్ డైరెక్టర్ సురేందర్ రావు తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..



సరోజన(ఫైల్)

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణానికి చెందిన తాటి సరోజన(45) తన భర్త తాటి వెంకటేశంతో కలిసి గజ్వేల్ పట్టణంలో బస్సు దిగి రోడ్డు దాటుతున్నది. ఈ క్రమంలో తూప్రాన్ నుంచి పిడిచెడ్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో సరోజనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినది. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జైలు నుంచి వచ్చిన వ్యక్తి బలవన్మరణం

● బావిలో దూకిన వైనం



గంగామేశ్వర్ (ఫైల్)

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జైలు నుంచి వచ్చిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దశంకరంపేట మండలం మూసాపేటలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట గ్రామానికి చెందిన బైకాని దేవయ్య చిన్న కుమారుడు బైకాని గంగామేశ్వర్(25)కు కొన్నేళ్ల క్రితం టేక్మాల్ మండలం హసన్ మహమ్మద్‌పల్లికి చెందిన మానసతో వివాహం జరిగింది. సంగమేశ్వర్ అత్తారింటికి ఇల్లరికం వెళ్లాడు. మూడు నెలల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో మానస ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో జైలుకు వెళ్లిన సంగమేశ్వర్ ఇటీవల బెయిల్‌పై వచ్చాడు. శుక్రవారం కోర్టుకు హాజరుకావాల్సిన గంగామేశ్వర్ గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం గ్రామ శివారులోని బావిలో అతని మృతదేహం లభించింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శి వేధింపులు..! చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

● న్యాయం చేయాలంటూ దళిత సంఘాల డిమాండ్



కొండి లక్ష్మి(ఫైల్)


చేగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన కొండి లక్ష్మి(49)శుక్రవారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది.. సాయంత్రానికి చెరువులో మృతదేహం తేలడంతో గ్రామస్తులు గుర్తించారు. ఇదిఇలా ఉండగా గ్రామపంచాయతీ కార్యదర్శి స్రవంతి వేధింపులు కారణంగానే ఆత్మహత్య , ఆత్మహత్యకు పాల్పడినట్లు దళిత సంఘాలు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గత శుక్రవారం గ్రామంలో జరిగిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా కొండి లక్ష్మి కార్యదర్శి స్రవంతి మధ్య గొడవ జరిగినట్లు చెప్తున్నారు. ఈ విషయమై కార్యదర్శి స్రవంతి కొండి లక్ష్మి విధులకు ఆటంకం కలిగించిందని కేసు పెట్టగా చేగుంట పోలీసులు కేసు నమోదు చేశారు. చెరువులో నుంచి తీసిన మృతదేహాన్ని తరలించకుండా దళిత సంఘాలు, కుటుంబసభ్యులు అడ్డుకుని పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకున్న తర్వాతే శవాన్ని తరలిస్తామని కుటుంబ సభ్యులు మొండికేశారు.

మద్యం మత్తులో పెయింటర్..

పటాన్‌చెరు సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో భార్యతో గొడవపడి ఓ పెయింటర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు అంబేడ్కర్ కాలనీలో రామకృష్ణ భార్య లక్ష్మి, కుమార్తె వర్షికలతో కలిసి ఉంటున్నాడు. పెయింటర్‌గా పని చేసే రామకృష్ణకు మద్యం అలవాటు ఉంది. శుక్రవారం సాయంత్రం రామకృష్ణను కూరగాయలకు డబ్బులు ఇవ్వాలని భార్య లక్ష్మి అడిగింది. దీనిపై ఇద్దరూ గొడవపడ్డారు. మద్యం మత్తులో ఉన్న రామకృష్ణ ఇంట్లోంచి భార్యను బయటకు వెళ్లగొట్టి తలుపులు వేసుకొని పడకగదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకున్నాడు. పక్కింటిలో ఉంటున్న నర్సింగరావు తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి, పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

● ఒకరికి తీవ్ర గాయాలు



పుల్‌కల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పుల్‌కల్ మండల కేంద్రమైన చౌటకూర్ సమీపంలో రహదారిపై కారు పల్టీ కొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి చౌటకూర్ గ్రామానికి చెందిన ఎర్దనూర్ ఎల్లయ్య (38) తన కారులో స్వగ్రామానికి వస్తున్నాడు. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై నుంచి ఈఎంపీఈఈ డిస్టిలరీ పరిశ్రమ వద్దకు రాగానే కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎల్లయ్యకు గాయాలు కావడంతో మొదట సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పిడుగు పడి పాడి ఆవు మృతి

అక్కన్నపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలం బొడిగపల్లి గ్రామానికి చెందిన పిట్టల రమేష్‌కు చెందిన పాడి ఆవు శుక్రవారం తెల్లవారుజామున పిడుగు పాటుకు గురై మృతి చెందింది. రమేష్ గురువారం సాయంత్రం పాడి ఆవును తన వ్యవసాయ బావి వద్ద కట్టి వేసి వచ్చాడు. ఉరుములు మెరుపులతో భారీ వర్షం పడడంతో పిడుగు పడి ఆవు మృతి చెందింది. రూ.80 వేల విలువ ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని రమేష్ కోరాడు.

సిరుల సీతాఫలం

- శీతాకాలానికి ముందే కోతకు..
- రామాయంపేట ఫలాలకు అంతర్రాష్ట్ర ఖ్యాతి
- నాలుగు రాష్ట్రాలు, జంటనగరాలకు ఎగుమతి
- రోజూ మార్కెట్‌కు 400గంపలు.. రూ.2లక్షల వ్యాపారం
- పండ్ల సేకరణతో కూలీల ఉపాధి


రామాయంపేటలో అమ్మకానికి తెచ్చిన సీతాఫలాలు

రామాయంపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సహజ సిద్ధమైన, రసాయనాలు లేని పండు సీతాఫలం. అరుదైన ఈ పండుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అడవులు, గుట్టల్లో పెరిగే ఈ పండ్లు సెప్టెంబరు, అక్టోబర్‌లలో మాత్రమే కాస్తాయి. ఈ సీజన్ ఎంతో మంది కూలీలకు ఉపాధిని కల్పిస్తుంది. ఈసారి విస్తారంగా వర్షాలు కురవడంతో రామాయంపేట మార్కెట్‌కు పెద్ద సంఖ్యలో కాయలు వస్తున్నాయి. ఇక్కడి పండ్లు తీయదనమే కాకుండా, పెద్దగా ఉండటంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు జంట నగరాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. రోజుకు 400 నుంచి 500 గంపలు మార్కెట్‌కు వస్తుండగా, ఒక్కో గంప రూ.500 వరకు పలుకుతుంది. దీంతో రోజుకు సుమారు రూ.2లక్షలకు పైగా వ్యాపారం జరుగుతోంది. సీతాఫలంలో సి విటమిన్, మెగ్నీషియం, ఐరన్ వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి తెలిపారు. ఇది షుగర్, చర్మ సమస్యలు, కీళ్ల వ్యాధులను అదుపులో ఉంచుతుందని, కంటి చూపును కూడా మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు.


పండ్లు కొనుగోలు చేస్తున్న వ్యాపారి

సీతాఫలాల అంగడి..

సిద్దిపేట శ్రీనివాసనగర్ నర్సాపూర్ చెరువు సమీపంలో సీతాఫలాల అంగడి నడుస్తుంది. దాదాపు మూడు నెలలు ఇక్కడ నుంచి హైదరాబాద్ మహానగరానికి సీతాఫలాలు సరఫరా చేస్తారు. సిద్దిపేట చుట్టుపక్కలో ఉన్న రైతులు తమ పొలాలు, గుట్టల్లో ఉన్న సీతాఫలం చెట్ల నుంచి పండ్లను సేకరించి ఇక్కడ విక్రయిస్తారు, ఒక్క బాక్స్ పండ్లు నాణ్యతను బట్టి 400 నుంచి 600 రూపాయల వరకు పలుకుతాయి. రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు వాటిని హైదరాబాద్ చుట్టుపక్కల విక్రయిస్తారు.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నేడు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర కోరారు. జిల్లా కోర్టులో న్యాయవాదులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజీ చేయదగిన పోలీసు కేసులు, భార్యాభర్తల వివాదాలు, ఎక్సైజ్ కేసులు, బ్యాంకు కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. కోర్టుల చుట్టూ తిరగకుండా, రాజీ మార్గం ద్వారా సమయాన్ని ఆదా చేసుకోవాలని కక్షిదారులకు సూచించారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని న్యాయవాదులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాల రెన్యూవల్ కోసం పాస్‌బుక్‌ల క్యూ


ఖేడ్‌లో బ్యాంకు ఎదుట క్యూలో పెట్టిన పాసు పుస్తకాలు

నారాయణఖేడ్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): యూరియా, ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం రైతులు పాసు పుస్తకాలు, చెప్పులు వరుసలో ఉంచిన విషయాలు ఇప్పటి వరకు తెలుసు. కానీ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మాత్రం రైతులు పంట రుణాల రెన్యూవల్ కోసం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముందు పాసు పుస్తకాలు బ్యాంకు తెరువక ముందే వరుసగా పెట్టారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచే నిరీక్షిస్తూ కనిపించారు. నారాయణఖేడ్ తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు అధిక గ్రామాలు ఉండడంతో రైతులంతా ఒకేసారి రుణాల రెన్యూవల్ కోసం వస్తుండడంతో రైతులు ఇలా పాసు పుస్తకాలను లైన్‌లో ఉంచుతున్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి బ్యాంకు ఉన్నతాధికారులు అదనపు సిబ్బందిని నియమిస్తే ఇలాంటి ఇబ్బంది ఉండదని, అందువల్ల అదనపు సిబ్బందిని నియమించి సత్వరమే రెన్యూవల్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


గోల్కొండ కాలనీలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కురిసిన భారీ వర్షం కారణంగా పట్టణంలోని పలు వార్డులను మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పర్యటించారు. పట్టణంలోని గాంధీనగర్, గోల్కొండలోని నివాసాల్లో నీరు చేరడంతో బాధితులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో కమీషనర్ శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతూ మరోసారి ఇళ్లలో నీరు చేరకుండా పరిష్కార మార్గాలు అన్వేషించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మురికి కాలువలు చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డిఈ మహేష్, ఎఈ నితిన్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

సుస్థిర పాలన అందిస్తున్న ఘనత మోదీదే

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


జిన్నారంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

జిన్నారం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘమైన సుస్థిర పాలన అందిస్తున్న ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం జిన్నారంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా పక్వాడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 17న మోదీ జన్మదినం సందర్భంగా కార్యకర్తలు రక్తదానం, తదితర సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ పాలనపై విమర్శలు చేశారు. స్థానికంగా సర్వే నంబర్ 1, 376లలో రైతుల భూములను హెచ్ఎండీఏ లేఅవుట్‌ల కోసం సేకరించి వారికి అన్యాయం చేశారని, రైతుల పక్షాన బీజేపీ పోరాడుతుందని తెలిపారు. పార్టీ పటిష్ఠత కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు జగన్‌రెడ్డి, నాయకులు ఐలేష్, రాజిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజు, అశోక్‌కుమార్, సుధాకర్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకే జీఎస్టీ తగ్గింపు

గజ్వేల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన జీఎస్టీ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయా దేశాల సుంకాల పేరుతో భారతదేశాన్ని భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నవారి ఆటలు కట్టించడానికే మోదీ హర్ ఘర్ స్వదేశీ పేరుతో స్వదేశీ వస్తువులు ఉత్పత్తిని, వాడకాన్ని చేపట్టారన్నారు. అందులో భాగంగానే జీఎస్టీని తగ్గించి కేవలం రెండు స్లాబులుగా కుదించారని అన్నారు. బీజేపీ నిజంగానే ఓట్‌చోరీకి పాల్పడితే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా ఏర్పాటవుతుందని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించినట్లు ఉన్నాయన్నారు. సిద్దిపేట జిల్లా రేషన్ డీలర్ల సంఘం నాయకులు ఎంపీని కలిశారు. ఐదు నెలల నుంచి రేషన్ కమీషన్ రావడం లేదని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎంపీ రాష్ట్ర సివిల్ సప్లయ్స్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, రాష్ట్ర నాయకులు సింగం సత్తయ్య, యెల్లు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్, గాడిపల్లి భాస్కర్, వెంకటరమణ, నందన్‌గౌడ్, మనోహర్‌యాదవ్, ఎల్కంటి సురేశ్, పంజాల అశోక్‌గౌడ్, సుభాష్ చంద్రబోస్, అనూప్, చారీ, నత్తి మల్లేశ్, నత్తి శివకుమార్, సందీప్ తదితరులున్నారు.

ఫ్లెక్సీల చింపివేత

గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయం వద్ద జీఎస్టీ అవగాహన సదస్సు సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు విచ్చేయగా, అక్కడ ఏర్పాటు చేసినన ఫ్లెక్సీలో ప్రొటోకాల్ పాటించలేదని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన నాయకులు ఆగ్రహంతో ఫ్లెక్సీలను చింపివేశారు. అనంతరం ఎంపీ రఘునందన్‌రావుకు ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

పోక్సో కేసులలో బాధితులకు 'భరోసా'

- మహిళా భద్రతా విభాగం డీఎస్పీ సర్దార్ సింగ్


భరోసా కేంద్రంలో అధికారులతో సమావేశమైన టిటా ప్రతినిధులు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పోక్సో, అత్యాచార కేసులలో బాధితులకు జిల్లా భరోసాకేంద్రం ఎంతో చేయూతనిస్తుందని మహిళా భద్రతా విభాగం డీఎస్పీ సర్దార్ సింగ్ కితాబిచ్చారు. సంగారెడ్డిలోని భరోసా కేంద్రాన్ని శుక్రవారం తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) ప్రతినిధుల బృందం సందర్శించింది. భరోసా కేంద్రం పనితీరు, బాధిత మహిళలకు అందిస్తున్న మెడికల్, లీగల్ సేవలు, తక్షణ పరిహారం వంటటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్దార్ సింగ్ మాట్లాడుతూ పోక్సో, అత్యాచార కేసులలో బాధిత పిల్లలు, మహిళలకు చేయూతనిచ్చేందుకు వృత్తి విద్యా కోర్సులు అందజేయడంతో పాటు అర్హతను బట్టి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ మేరకు వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో టిటా ప్రతినిధి ముత్యాలు, భరోసా ప్రోగ్రామ్ మేనేజర్ రేంజి జోసెఫ్, భరోసా కో ఆర్డినేటర్ దేవలక్ష్మి " తదితరులు పాల్గొన్నారు.

ఆబ్కారీ ఆమ్దానీ

5వ పేజీ తరువాయి

వేస్తున్నారు. దరఖాస్తుల సంఖ్య పెరిగితే మొత్తంగా రూ.400 కోట్లు కూడా దాటే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు.

ఎన్నికలపైనే ఊగిసలాట

2024 జనవరిలో నిర్వహించాల్సిన పంచాయతీ ఎన్నికలు, మేలో జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. సెప్టెంబరు నెలలో పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ సాంకేతిక కారణాల మూలంగా జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికలు మరో 2 నెలలపాటు వాయిదా పడితే వైన్‌షాపులకు పోటీ తీవ్రమవుతుంది. నవంబరు 30వ తేదీలోపు ఎన్నికలు జరిగినట్లయితే గతంలో వచ్చిన దరఖాస్తులు కూడా కష్టమే. ఎందుకంటే కొత్త వైన్‌షాపులు 2025 డిసెంబరు 1వ తేదీ నుంచి 2027 నవంబరు 30 వరకు కొనసాగుతాయి. ఈ మధ్య కాలంలో మున్సిపల్ ఎన్నికలు మాత్రమే ఉంటాయి. 2028లో అసెంబ్లీ, 2029లో పార్లమెంటు ఎన్నికలు జరిగే పరిస్థితి ఉంటుంది. ప్రతీ ఎన్నికల్లోనూ మద్యం పంపిణీ జరుగుతోంది. అందుకే షాపులను దక్కించుకుంటే తమకు పెట్టిన పెట్టుబడిని మించిన ఆదాయం వస్తుందని ఆశిస్తున్నారు. ఎన్నికలు లేకుంటే సాదాసీదా అమ్మకాలతో ఫలితం ఉండదని ఆలోచిస్తున్నారు.

కల్తీపై నిఘా అవసరమే..

మద్యం దుకాణాల గడువు ముగుస్తున్నందున పలుచోట్ల నిర్వాహకులు అడ్డదారులు తొక్కిన ఘటనలు గతంలో వెలుగులోకి వచ్చాయి. మద్యాన్ని కల్తీ చేయడం, నీళ్ల కలపడం, స్పిరిట్ మిక్స్ చేయడం వంటి సంఘటనలు బయటపడ్డాయి. ఈసారి కూడా అబ్కారీ శాఖ అధికారులు ఆ దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లాభాపేక్షతో మద్యం ప్రియులకు కల్తీ సరుకును అంటగడుతున్నారనే ఆరోపణలు ఇప్పటికే ఉన్నాయి. ఇలాంటి పలు ఘటనలను టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. సమయం తక్కువగా ఉన్నందున నిఘా పెంచితే కల్తీకి ఆస్కారం లేకుండా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కార్లు అద్దెకు తీసుకుని విక్రయం

- నిందితుల్లో ఏఆర్ కానిస్టేబుల్
- ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి పక్కదారి
- ఒకరి అరెస్ట్.. ఆరు కార్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న టు టౌన్ సీఐ ఉపేందర్

సిద్దిపేట క్రైం సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఆయన ఏఆర్ కానిస్టేబుల్.. ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. అప్పులు తీర్చేందుకు.. మళ్లీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడేందుకు తనకున్న పలుకుబడితో వరసకు సోదరుడైన మరొకరితో కలిసి కార్లు అద్దెకు తీసుకుని.. అమ్ముకునేవారు. కార్లు అద్దెకు ఇచ్చిన వారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ కేసులో ఐదుగురిని నిందితులుగా గుర్తించి అందులో ఒకరిని అరెస్ట్ చేసి, ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. జిల్లాలోని చిన్నకోడూరుకు చెందిన మిద్దెల మహేష్ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన మహేష్ అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చేందుకు అడ్డదారిలో డబ్బు సంపాదించాలని భావించాడు. తనకు సోదరుడి వరుస అయ్యే రాజన్న సిరిసిల్ల జిల్లా తంగెళ్లపల్లి మండలం బస్వాపూర్‌కు చెందిన బూరుగుపల్లి శేఖర్‌తో కలిసి సెల్ఫ్ డ్రైవింగ్ కోసమని రోజుకు రూ. 1,200 అద్దె ప్రతిపాదికన ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కార్లు అద్దెకు తీసుకున్నారు. అలా అద్దెకు తీసుకున్న కార్లలో కొన్నింటిని రంగారెడ్డి జిల్లా చర్లపటేల్‌గూడకు చెందిన పట్నం నరేష్‌రెడ్డి ద్వారా కుదువ పెట్టి డబ్బులు తీసుకున్నారు. మరికొన్నింటిని రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్‌కు చెందిన ధనావత్ మాత్రు, నల్గొండ జిల్లాకు చెందిన ధనావత్ సంతోష్‌లకు అమ్మారు. సిద్దిపేటకు చెందిన సమీర్ వీరికి ఐదు కార్లను అద్దెకు ఇవ్వగా కొన్ని రోజులు సక్రమంగా అద్దె చెల్లించి తర్వాత ఆపేశారు. దీంతో సమీర్ ఇద్దరినీ నిలదీశారు. దాట వేస్తుండటంతో సిద్దిపేట టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుల్లో ఒకరైన పట్నం నరేష్‌ను అరెస్ట్ చేసి, వివరాలు రాబట్టారు. ఇబ్రహీంపట్నం వెళ్లి ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారని, వారి వద్ద మరో నాలుగు కార్లు ఉన్నాయని సీఐ తెలిపారు.

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు

- రాష్ట్రస్థాయికి 11 మంది ఎంపిక


కళా ఉత్సవ్‌లో గెలుపొందిన విద్యార్థులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీలు ముగిశాయి. చివరి రోజు డాన్స్, ఫోక్, డ్రామా, చిత్రలేఖనం, బొమ్మ తయారీ పోటీలు జరిగాయి. 11 విభాగాల్లో ప్రథమ స్థానం పొందిన 11 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, డీఎస్‌వో రాజిరెడ్డి, న్యాయనిర్ణేతలు అంజాగౌడ్, లక్ష్మీప్రసన్న, గోపాల్, సిద్దిరాములు, వంశీకృష్ణ, శశిధర్, శ్రీకాంత్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు..

తబల పోటీల్లో బాలజీ(జెడ్పీహెచ్ఎస్, పొడ్చన్‌పల్లి), డ్రామా పోటీల్లో పవన్ గ్రూప్ (రాజ్‌పల్లి), నృత్య పోటీల్లో శృతిక గ్రూప్(జెడ్పీహెచ్ఎస్, పాపన్నపేట), క్లాసికల్ డాన్స్ శ్రీహర్షిణి(బాలికల కళాశాల మెదక్), వాయిద్యాల పోటీల్లో మహేష్ గ్రూప్ (జెడ్పీహెచ్ఎస్, వెల్దుర్తి), పాటల పోటీల్లో తరణ్(ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ కొడిపల్లి), చిత్రలేఖనం పోటీల్లో అఖిచంద్ర (మోడల్ స్కూల్ చిన్నశంకరంపేట). బొమ్మల తయారీ సాత్విక్ (ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ కొడిపల్లి), సంప్రదాయ కథల పోటీల్లో కావేరి గ్రూప్(జీఎస్‌హెచ్ఎస్, మెదక్), పాటల పోటీల్లో స్పందన గ్రూప్(సోషల్ వెల్ఫేర్ కొల్చారం), త్రిడీ బొమ్మల తయారి విఘ్నేష్ గ్రూపు(జెడ్పీహెచ్ఎస్ దర్పల్లి).

ఇంకెన్నాళ్లీ బారుల బాధలు..


నంగునూరులో యూరియా కోసం బారులు తీరిన రైతులు


రాయపోల్ మండలం వడ్డెపల్లిలో చెప్పులను క్యూలో పెట్టిన రైతులు


నిజాంపేటలో రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న రైతులు


వెల్దుర్తి రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం లైన్‌లో నిలబడిన రైతులు

నిజాంపేట/రాయపోల్/చిన్నకోడూరు/చిన్నశంకరంపేట/నంగునూరు/అక్కన్నపేట/వెల్దుర్తి/బెజ్జంకి/ మిరుదొడ్డి , సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంటలకు సరిపడా యూరియా అందక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పడిగాపులే పనిగా రోజూ పీఏసీఎస్, అగ్రోస్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. శుక్రవారం కూడా తెల్లవారుజాము నుంచే యూరియా కోసం దుకాణాల వద్ద రైతులు బారులు తీరారు. కొన్నిచోట్ల రైతులు క్యూలో చెప్పులు పెట్టారు. అక్కడక్కడ తోపులాటలు, ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు. ఎరువుల సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో నిరసనలకు దిగారు. సరిపడా యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. నిజాంపేట, రాయపోల్, చిన్నకోడూరు, చిన్నశంకరంపేట, నంగునూరు , వెల్దుర్తి, మిరుదొడ్డి , అక్బర్‌పేట-భూంపల్లి తదితర మండలాల్లో రైతులు బారులు తీరారు. అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన తొమ్మిది యూరియా బస్తాలను మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా శుక్రవారం సీజ్ చేశారు. ఈ విషయమై అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

- చైనా నుంచి యూరియా దిగుమతులు లేకపోవడంతోనే యూరియా కొరత ఏర్పడిందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం బెజ్జంకి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ యూరియా కొరత దేశ వ్యాప్తంగా ఉందన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను అందించలేకనే దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకం శ్రీరాములు అన్నారు. గురువారం అక్బర్‌పేటలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలపై విమర్శలను మానుకుని , రైతులకు యూరియాను అందించాలని కోరారు.

మహిళ కడుపులోంచి 3.2 కిలోల గడ్డ తొలగింపు

- దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్


ఫైబ్రాయిడ్‌గడ్డ తొలగించబడిన మహిళ

దుబ్బాక, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు మరో అరుదైన ఆపరేషన్ చేశారు. తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న హబ్సిపూర్ గ్రామానికి చెందిన ఒక మహిళకు పరీక్షలు నిర్వహించి, ఫైబ్రాయిడ్ గడ్డగా గుర్తించారు. డాక్టర్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసి 3.2 కిలోల ఫైబ్రాయిడ్ గడ్డను విజయవంతంగా తొలగించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఇలాంటి అరుదైన ఆపరేషన్లు జరుగుతున్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు.

న్యూస్ బాక్స్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మునిపల్లి, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని మునిపల్లి ఎస్‌ఐ రాజేష్ నాయక్ సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎస్‌ఐ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పలు కేసుల్లో రాజీపడే అవకాశం ఉంటుందన్నారు. కక్షిదారులు సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ పరీక్షకు 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వచ్చే నెల 6 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకొని పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

ఆర్టీసీ యాత్రాదానం

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాత్రాదానం పేరుతో రామచంద్రాపురం బెల్ ఆర్టీసీ డిపో అధికారులు వ్యక్తిగత శుభకార్యక్రమాలకు బస్సులు ఏర్పాటు చేస్తామని డిపో మేనేజర్ సుధ చెప్పారు. ఇందుకు తగిన మొత్తాన్ని సంస్థకు విరాళంగా ఇవ్వాలని చెప్పారు. టూర్ ప్రారంభానికి వారంరోజుల ముందు బస్సు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. మరిన్ని వివరాలను 7382814249, 9391072283, 9063401072 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రామాయంపేటలో వరుస దొంగతనాలు

రామాయంపేట, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముసుగు ధరించిన దుండగుల ముఠా, తాళాలు వేసిన ఇళ్లనే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్నారు. గురువారం అర్ధరాత్రి కూడా ఇబ్రహీం అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులగొ జరిగిన దొంగతనాలపై ఓ వైపు పోలీసులు నిఘా పెంచినా.. ఆ మరునాడే దొంగలు తమ పని కానిచ్చుకోవడం గమనార్హం.

ఘనంగా తెలంగాణ భాషాదినోత్సవం

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ బాష దినోత్సవ వేడుకలను, ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా టీఎల్ఎమ్ మేళా, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలువురి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

కాలనీల్లో థీమ్ పార్కులు

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో థీమ్‌పార్కులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి కాకతీయనగర్ కాలనీలో రూ.3.20 కోట్ల హెచ్ఎండీఏ నిధుల అంచనా వ్యయంతో థీమ్‌పార్కు, రూ.1.07కోట్లతో సీసీరోడ్డు, భూగర్భ మురుగు పైపులైన్ నిర్మాణపనులు కార్పొరేటర్ పుష్పానగేష్‌తో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్మశానవాటికలో సీసీరోడ్లు, వెయిటింగ్‌హాలు, దోబీఘాట్, ప్రహరీ నిర్మాణపనులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కార్పొరేటర్ పుష్పానగేష్‌తో కలిసి ప్రారంభించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మాసాయిపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఇటీవల పాముకాటుతో, అనారోగ్యంతో మృతి చెందినవారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాసాయిపేటలో ఇటీవల పాముకాటుతో మృతి చెందిన స్టేషన్ బాలమ్మ కుటుంబాన్ని, అనారోగ్యం బారిన పడిన పోచమ్మ కోడూరి కిష్టయ్య కుటుంబాలను ఆవుల రాజిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు

ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు
- భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మతులపై కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి అధికారులతో సమీక్షాసమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో ప్రజల అభివృద్ధితో పాటు అవసరాలు తీర్చడమే లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, చెరువులకు సంబంధించి తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన చేపట్టే పనులపై శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రకృతి విపత్తుల నేపథ్యంలో భారీ వర్షాలతో జిల్లాలో పంచాయతీరాజ్, నీటి పారుదల, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖలకు నష్టం వాటిల్లిందన్నారు. తాత్కాలిక, శాశ్వత పనులు అంచనాలను సంబంధిత శాఖల ద్వారా అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ఎస్‌డీఆర్ఎఫ్ రూ. 10 కోట్ల నిధులు ఉన్నాయని, విపత్తు నిధులు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. శాశ్వత పనులతో సమస్యలు లేకుండా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పనులను వేగవంతం చేసి ప్రజలకు రవాణా సౌకర్యానికి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సుందరీకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఎంట్రన్స్ రోడ్డు లైటింగ్, మూడు చౌరస్తాల సుందరీకరణ, బ్రాస్ మెటీరియల్‌తో అంబేడ్కర్ విగ్రహం తయారు చేయించాలన్నారు. మెదక్ చర్చిలో సెంట్రల్ లైటింగ్, ఇంటర్నల్ సీసీ రోడ్లకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో చర్చించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కంటే వినూత్నంగా ఐ లవ్ మెదక్ అనే నినాదంతో ఉండాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు సర్దార్‌సింగ్, నరసింహులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల నిర్మాణం జరగాలి

కౌడిపల్లి, సెప్టెంబర్ (ఆంధ్రజ్యోతి) 12: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ముట్రాజ్‌పల్లిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని తహసీల్దార్ కృష్ణయ్యతో కలసి సందర్శించారు. అనంతరం గ్యాస్ లీకేజీతో పేలిన ఇంటి బాధితుల ఆకుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి, సంఘటన వివరాలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌తో పాటు అర్ఐ శ్రీహరి ఉన్నారు.

యువ శాస్త్రవేత్తలు మెలకువలు నేర్చుకోవాలి



సిలాంపల్లిలో పలు రాష్ట్రాలనుంచి వచ్చిన వారికి చిత్రపటం ద్వారా అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చిలప్‌చెడ్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పలు క్షేత్రాలను పరిశీలిస్తూ యువ శాస్త్రవేత్తలు ఎన్నో మెలకువలు నేర్చుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త గోపాల్‌లాల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని సిలాంపల్లి గ్రామంలో 107 మంది యువ శాస్త్రవేత్తలకు నేషనల్ అకాడమి ఆఫ్ రూరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ మరియు కృషివిజ్ఞాన కేంద్ర ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శన సదస్సును నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి యువ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి శాస్త్రవేత్తలు గ్రామీణ వాతావరణం, వ్యవసాయం తదితర అంశాలను వివరిస్తూ, గ్రామ చిత్రపటాన్ని ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దామోదర్ రెడ్డి, రమేష్, నల్కర్, శ్రీనివాస్, రవికుమార్ ప్రతాప్‌రెడ్డి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, రైతులు నాయకులు

కొండాపూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): త్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని శుక్రవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండాపూర్ మండలం గిర్మాపూర్, అలియాబాద్, మారేపల్లి, మాచేపల్లి గంగారం గ్రామాల రెవెన్యూ పరిధిలోని నిరుపేద రైతుల భూములు త్రిపుల్‌ఆర్‌లో కోల్పోతే వారు రోడ్డున పడతారని అవేదన వ్యక్తం చేశారు. రైతుల మంచి కోరే ప్రభుత్వం అంటూ ఆ రైతులను రోడ్డున వేయడం విడ్డూరంగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మాస్టర్‌ప్లాన్, అలైన్‌మెంట్లలో మార్పులు చేస్తూ రైతుల భూములు లాక్కోవడం దారుణమన్నారు. రైతులకు న్యాయం జరుగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాణిక్‌ప్రభు, రుక్మోద్దీన్, రైతులు, నాయకులు ఉన్నారు.

యూరియా కోసం రైతులకు ఆందోళన వద్దు



నానో యూరియా వేసిన పొలాన్ని పరిశీలిస్తున్న మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్

నర్సాపూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదని, అయితే దొరకదన్న తప్పుడు ప్రచారం వల్ల ఒకేసారి రైతులు రావడంతో పెద్దసంఖ్యలో వచ్చి యూరియా కోసం బారులు తీరి ఇబ్బందులు వస్తున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ పేర్కొన్నారు. నర్సాపూర్ మండలం ఆవంచలో రైతువేదికలో యూరియా పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం అదే గ్రామంలో నానో యూరియాతో ఓ రైతు 13 ఎకరాల్లో పండించిన పంటను పరిశీలించారు. అనంతరం నర్సాపూర్ ఏడీఏ కార్యాలయం సందర్శించి స్థానిక ఏడీ సంధ్యారాణితో కలిసి విలేకరులతో మాట్లాడారు. యూరియా జిల్లాకు అవసరమున్నంత మేర సరఫరా అవుతుందని, ఎలాంటి కొరత లేదన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఈ సీజన్‌కు అవసరమైనంత యూరియా పూర్తిస్థాయిలో వస్తుందన్నారు. కాగా జిల్లాలో రైతులు యూరియాను వాడాల్సిన దాని కంటే కూడా ఎక్కువగా వాడుతున్నట్లు గుర్తించామని, ఎకరాకు ఒకటిన్నర సంచుల యూరియా మాత్రమే వాడాలని, అయితే జిల్లాలో రెండుసంచులకు మించి వాడుతున్నారన్నారు. దీంతో పంట పచ్చగా కనిపించినా దిగుబడి రాకపోగా పంట దెబ్బతినే ప్రమాదముందన్నారు. అదేవిధంగా యూరియాకు బదులు నానో యూరియా వాడకంపై దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు. దీని వల్ల తక్కువ ఖర్చుతో పాటు దిగుబడి బాగా పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దీపిక కూడా ఉన్నారు.

కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

శివ్వంపేట, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల మెదక్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి శుక్రవారం శివంపేట జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం క్లాస్ రూంలు తిరుగుతూ విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. కళాశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి విద్యార్థుల యొక్క ఎఫ్ఆర్ఎస్ నిర్ధారణ చేయాలని వార్షిక పరీక్షల ఫలితాలను మెరుగుపరిచేలా కృషి చేయాలన్నారు. సెలవులను హెచ్‌ఆర్ఎంఎస్‌లో నమోదు చేయాలని విద్యార్థులు గైర్హాజర్ కాకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.

అన్ని రంగాల్లో రాణించేలా బోధన ఉండాలి

పాపన్నపేట/టేక్మాల్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు బోధించాలని డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట మండలంలోని నామాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ...ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యల గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈవో ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులున్నారు. అదేవిధంగా టేక్మాల్ మండలకేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి జిల్లా విద్యాధికారి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని సూచించారు.

గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలి



మాసాయిపేట మండల కేంద్రంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్/మాసాయిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీని గ్రామాల్లో బలోపేతం చేసి వచ్చే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటడమే ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్‌మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. నర్సాపూర్ మండల స్థాయి కార్యశాల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు నగేష్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా వాల్దాస్‌మల్లేశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ మోదీ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా కార్యదర్శి బాలరాజు, మండల నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మాసాయిపేట మండల కేంద్రంలో సాయంత్రం బీజేపీ మండల పార్టీ సమావేశానికి వాల్దాస్ మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ బూత్‌స్థాయి అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతూ.. మోదీ జన్మదిన సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వివిధ సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరాలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాసాయిపేట మండల అధ్యక్షుడు మొలుగు నరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున భవనాల విషయంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి జడ్పీ పాఠశాలను సందర్శించారు. పాడుబడిన భవనాల వివరాలు తెలుసుకున్నారు. పాతభవనాల్లో జరుగుతున్న బోధనను వేరే గదుల్లోకి మార్చాలంటూ సూచనలు చేశారు.

ఆహార నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆహార నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ హెచ్చరించారు. సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల పక్కన నిర్వహిస్తున్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో శుక్రవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన తెలిపారు.

భారీ వర్షానికి నిలిచిన రాకపోకలు

హవేళిఘణపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోస్తారు వర్షం కురవడంతో శుక్రవారం పోచారం డ్యాం, చెరువులు, వాగులు పారుతున్నాయి. హవేళిఘణపూర్ పెద్ద చెర్వు కట్టకు తాత్కాలిక మరమత్తులు చేపట్టినా వర్షం నీటికి భారీగా వరద రావడంతో చెరువు నీళ్లతో తిమ్మాపల్లి, చౌట్లపల్లి రోడ్డులపై నుంచి పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం నీళ్లు తగ్గడం వల్ల సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.

మిర్జాపల్లి ఆర్‌యూబీలో వర్షం నీరు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండల పరిధి మిర్జాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని కురిసిన భారీ వర్షానికి శుక్రవారం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జిలో నిరు నిలవడంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు మరో మార్గం లేకపోవడంతో వాహనదారుల పాట్లు అంతా ఇంతా కాదు. వర్షాకాలంలోనూ ప్రయాణం సాగించేలా అధికారులు మరో మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: జడ్పీ సీఈవో



చేగుంట జడ్పీహెచ్ఎస్‌లో పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరును పరిశీలిస్తున్న సీఈవో ఎల్లయ్య

చేగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. శుక్రవారం చేగుంట జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం, పాఠశాలలోని అదనపు తరగతి గదుల నిర్మాణం పనులను పాఠశాల ఆవరణలోని పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం చందాయిపేటలో నిరుపయోగంగా ఉన్న పురాతన జడ్పీహెచ్ఎస్ పాఠశాలను మాసాయిపేట కస్తూర్బా పాఠశాల ఏర్పాటు కోసం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో నీరజ, ఎంపీ ఓ నరేష్, ఈవో వెంకటేష్ ఉన్నారు.

- **శివ్వంపేట:** ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఓటర్ జాబితా సవరణ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ, సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి ఎంపీడీవో సిబ్బంది ఉన్నారు.

డివిజన్‌లో రెవెన్యూపరమైన సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

నర్సాపూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ డివిజన్ పరిధిలో రెవెన్యూపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లాఅదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయం సందర్శించిన సందర్భంగా భూభారతి, రెవెన్యూసదస్సులో ఫైల్స్ పరిశీలించారు. అదేవిధంగా గ్రీవెన్ సెల్‌లో వచ్చిన ఫిర్యాదులు వాటి పరిష్కారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ మాట్లాడుతూ ఫైళ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. వర్షాలు పడుతున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకుంటూ ఎక్కడైన ఇబ్బందులు తలెత్తితే వెంటనే స్పందించేలా చూడాలన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో చెరువులు, కుంటలలో నీటి నిల్వలు వాటి పరిస్థితులు తెలుసుకోవడమే కాకుండా, రోడ్లు కల్వర్టులు, బ్రిడ్జిలను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ధర్పల్లి గ్రామ శివారు హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శుక్రవారం చిన్నశంకరంపేట పోలీసులు సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ నారాయణగౌడ్ వివరాల మేరకు.. ధర్పల్లి హల్దీవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారమందింది. ఈ మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశారు.

అధికలోడ్‌తో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

అల్లాదుర్గం,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అధిక లోడ్ విద్యుత్ భారంతో శుక్రవారం అల్లాదుర్గంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగి దగ్ధమైంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పలు కాలనీలల్లో విద్యుత్ సరఫరా కోసం పట్టణంలోని ఈశ్వరుడి ఆలయం సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఏడాది క్రితం కాలిపోవడంతో జీపీ కార్యాలయం ఆవరణలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. కాలిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మాత్రం అధికారులు మరమ్మతులు చేయించలేదు. దీంతో ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక భారం పడి తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. శుక్రవారం ఉదయం ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి భారీగా మంటలు వ్యాపిస్తుండటంతో కాలనీవాసులు ట్రాన్స్‌కో ఏఈకి సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించి నీటితో మంటలను ఆర్పివేశారు. కాగా లైన్‌మెన్ గంట ఆలస్యంగా రావడం పట్ల మండిపడ్డారు.

కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగం



కానుకుంటలో బీఆర్టీయూ ఆటో యూనియన్ జెండా ఎగురవేస్తున్న గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో ఆటో డ్రైవర్ల బతుకుల ఆగమయ్యాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం నాడు గుమ్మడిదల మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అనుబంధ సంస్థ బీఆర్టీయూ మల్లికార్జున ఆటో అసోసియేషన్ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. అనంతరం గుమ్మడిదల ప్రధాన వీధుల గుండా ఆటో ర్యాలీ నిర్వహించగా, ఆటో యజమానులు, డ్రైవర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో సరైన జీవనోపాధి లేక ఆటో డ్రైవర్ల జీవితాలు దయనీయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల నెలకు రూ.12 వేలు ఇస్తామనే హామీ అటకెక్కిందని మండిపడ్డారు. త్వరలోనే ఆటో డ్రైవర్లందరికీ బీమా సౌకర్యం కల్పించేందుకు బీఆర్ఎస్ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు నరసింహారెడ్డి, హనుమంత్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, వేణు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



తూప్రాన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

తూప్రాన్/మనోహరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో శుక్రవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ ఉత్సవం ఘనంగా జరుపుకున్నారు. తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ వద్దగల మజీద్‌లో శుక్రవారం ప్రార్థనల అనంతరం ముస్లింలు మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని ఆర్టీసీ బస్టాండ్ నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మనోహరాబాద్ మండల కేంద్రంలోని జామా మసీద్ నుంచి జాతీయ రహదారి మెయిన్ రోడ్డు వరకు ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు.

నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ



లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేస్తున్న గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి

పుల్‌కల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో ఇటీవల కొత్తగా లబ్దిదారులకు మంజూరైన రేషన్ కార్డులను శుక్రవారం అందజేశారు. కార్డులు పొందిన లబ్దిదారులకు ఈ నెల బియ్యం కోటాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొల్ల మహేశ్, చంటి రమేశ్, నలగండ్ల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హరీశ్‌ను కలిసిన నాయకులు



హరీశ్‌రావుతో పుల్కల్, చౌటకూర్ మండలాల బీఆర్ఎస్ నాయకులు

పుల్‌కల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావును పుల్కల్, చౌటకూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు ఇంటికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నియోజకవర్గ అగ్రనేత పట్లోళ్ల జైపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో తరలివెళ్లి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. హరీశ్‌రావుపై లేనిపోని ఆరోపణలు వస్తుండటంతో ఆయనకు మద్దతుగా ఆయా మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లి సంఘీభావం ప్రకటించారు. బీఆర్ఎస్ పుల్కల్, చౌటకూర్ మండలాల అధ్యక్షులు మాచర్ల విజయ్‌కుమార్, చౌకంపల్లి శివకుమార్, ఉమ్మడి పుల్కల్ మండలం సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు బక్కారెడ్డి కిష్టారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో ప్రజా సేవ అభినందనీయం

నర్సాపూర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ తన సొంత ఖర్చులతో స్థానిక ప్రజలకు నిరంతరం సేవ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్ పుట్టినరోజు సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో మరమ్మతుకు నోచుకోకుండా వృథాగా ఉన్న మినరల్‌వాటర్ ప్లాంటును తన సొంత డబ్బు రూ.40వేలతో మరమ్మతు చేయించి ప్రజలకు వినియోగంలోకి తెచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ హాజరయ్యారు. గ్రామంలోని వృద్ధులకు చేతికర్రలకు కూడా అందించారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

చేగుంట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు కళాశాల ప్రహరీ గోడ, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకు కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి కళాశాల తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులు వివిధ సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.